కరెంట్‌షాక్‌తో గొర్రెల మృతి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌తో గొర్రెలు మృతి చెందిన ఘటన మంగళవారం తిమ్మారెడ్డి శివారులో చోటుచేసుకుంది. స్థానిక సర్పంచ్ అబ్దుల్ అలీ తెలిపినా వివరాల ప్రకారం కొక్కొండ గ్రామానికి చెందిన బీరయ్యకు చెందిన గొర్లు మేత మేపటానికి తిమ్మారెడ్డి శివారుకు రావటంతో పొలం లో ఉన్న 11 కె వి సపోర్ట్ వైర్ ఉన్న కరెంట్ తీగా ఇటీవల కురిసిన వర్షాలకు ఈదురు గాలులకు వంగటంతో అటుగా వస్తున్న రెండు గొర్రెలకు తగిలి కరెంట్ షాక్ తో మృతి చెందాయి. బాధితుడికి సుమారు 20,000 రూపాయల నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నాడు.



మృతిచెందిన గొర్రెలు

అనుదినం జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి 1

బుధవారం 03 మే 2023

కొనుగోలు కేంద్రాల ద్వారానే మద్దతు ధర

నవతెలంగాణ-సదాశివనగర్

రైతుల పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయించడం ద్వారానే మద్దతు ధర లభిస్తుందని ప్రజాప్రతినిధులు అన్నారు. మండల కేంద్రంలోని సదాశివనగర్ సొసైటీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ అనసూయ జడ్పిటిసి కమిలి నర్సింలుతో పాటు సొసైటీ చైర్మన్ కమలాకర్ రావు ప్రారంభించారు. ఉత్నూర్ సొసైటీ పరిధిలోని వజ్జపల్లి తండా, యాచారం గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను చైర్మన్ ఖాట్మండీ ప్రభాకర్ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గాదర్ శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బులిపెల్లి మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ బీరయ్య, రైతుబంధు అధ్యక్షుడు ఎలేటి భూమిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, తహసీల్దార్ ధన్వల్, ఏఈవో కవిత తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అతలాకుతలం

- ఎక్కడికక్కడ పంటలకు నష్టం
- కల్లాలో మొలకెత్తిన ధాన్యం
- బురదమయంగా మారడంతో కోతకు అంతరాయం

నవతెలంగాణ-నసురుల్లాబాద్



నసురుల్లాబాద్‌లో భారీ వర్షం

గత ఆరు రోజులుగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో అకాల వర్షం కురుస్తుండటంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. ధాన్యం ఎండబెట్టేందుకు అవకాశం లేకపోగా.. ప్రతిరోజూ వర్షం కురుస్తుండటంతో తడిచి ముద్దయి మొలకెత్తుతుంది.

బాన్సువాడ డివిజన్ పరిధిలోని నసురుల్లాబాద్, బీర్కూర్, బాన్సువాడ మండలంలో సోమవరం రాత్రి కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పొలాల్లో నీరు చేరి పంటలు దెబ్బతిన్నాయి. కోతకొచ్చిన వరి నేలవాలి మొలకొచ్చే పరిస్థితి తలెత్తింది. ఐదు రోజుల క్రితం కురిసిన వడగళ్లతో పైర్లకు నష్టం వాటిల్లిన బాధ నుంచి రైతులు తేరుకోకముందే మరోసారి వరుణుడు ప్రకోపాన్ని చూపాడు. వర్షంతో పొలాల్లోకి నీరు చేరడంతో కోతలకు అంతరాయం ఏర్పడింది. హార్వెస్టర్లతో వరి కోయాలంటే వారం పాటు పొలాలు ఎండాల్సిందేనని రైతులంటున్నారు. ఆ లోపు వడ్లు చేలోనే రాలే ప్రమాదం లేకపోలేదు. వర్షాలతో రైతులు నిండా మునుగుతున్నారు. పంట చేతికొస్తుందో రాదోనని రైతులు ఆందోళనలో ఉన్నారు. భారీ వర్షం తో అంకుల్ తండా, సంగెం గ్రామాల్లో ఇళ్లలోకి వరద చేరి జనం ఇబ్బంది పడ్డారు. బాన్సువాడ పలు కాలనీలో నీరు ఇళ్ల చుట్టు ముట్టడంతో ప్రజలు ఇబ్బందు లకు గురయ్యారు.

నసురుల్లాబాద్ , దుర్కి , మిర్జాపూర్ కొనుగోలు కేంద్రాల వద్ద కుప్పలు తడిచాయి. నసురు ల్లాబాద్ మండలంలో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి తోడు ఈదురు గాలులతో పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. వర్షంతో అధికారులు ముందస్తుగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వర్షానికి మండలంలో పంట నష్టమేమీ జరగలేదని వ్యవసాయ అధికారి నాగేందర్ తెలిపారు. మైలారం నస్రుల్లాబాద్ గ్రామాల్లో దాన్యం కల్లాలను తహసీల్దార్ భావయ్య పరిశీలించారు. రైతులు అధైర్య పడొద్దని, ప్రభుత్వ పరంగా సాయం అందజేస్తామని తెలిపారు. ఎండిన ధాన్యం వెంటనే కాంట చేయనున్నట్టు తెలిపారు.



మొలకలు వచ్చిన ధాన్యం చూపుతున్న రైతులు

నువ్వు పంటకు బూజు

ఈదురు గాలులకు పూర్తిగా నేల వాలిన నువ్వు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండలంలో నువ్వు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సంవత్సరం నువ్వు పంటపై ఆశలు పెట్టుకొని రైతులు వందల ఎకరాలలో సాగు చేశారు. పంట కూడా బాగా ఉండి, ఈసారి గిట్టుబాటు అవుతుందనుకున్న సమయంలో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలకు నువ్వు పంట చేతికొస్తుందనే ఆశలను రైతులు వదిలేసుకుంటున్నారు. పంట చేలలో కోత కోయని నువ్వు పంట ఇప్పటికే ఈదురు గాలులకు మొత్తంగా నేల వాలింది. కొందరు రైతులు కోతలు కోసి, మోపులుగా కట్టలు కట్టి పెట్టుకున్నారు. తరచూ కురుస్తున్న వర్షాలతో కోసిన నువ్వు తడిచి, నువ్వు మెదలకు బూజు పడుతుంది. నువ్వు పంటను కోయాలంటే కూడా రైతులకు ఖర్చు పెరుగుతుందని అంటున్నారు. బూజు వస్తున్నా నువ్వు వర్షాలు తగ్గిన తర్వాత ఎండబెట్టి రాల్చిన విత్తు రాలదని ఆందోళన చెందుతున్నారు. కొత్త కోసిన నువ్వు పంట భూమి పాలు అయినట్లేనని, చేతికి వచ్చేది చాలా తక్కువ అని పేర్కొంటున్నారు. ప్రభుత్వమే నువ్వు రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



రాస్తారోకో చేపట్టి నినాదాలు చేస్తున్న రైతులు

తేమ శాతం వచ్చినా వడ్లు కొంటలే

- సొసైటీ తీరుపై రైతుల రాస్తారోకో

నవతెలంగాణ-మాక్లూర్

తమ ధాన్యానికి తేమ శాతం 17 వచ్చినా.. కొనుగోలు చేయడం లేదని 15 శాతం వచ్చిన తర్వాత తీసుకురావాలని కాంటా వేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే వర్షాలు కురుస్తుండటంతో పంట తడిచి ముద్దవుతుందని, ఈ తరుణంలో తేమ శాతం వచ్చిన ధాన్యం సైతం కొంటలేరని ఆవేదన వ్యక్త చేస్తూ మాక్లూర్ మండలంలోని మామిడిపల్లిలో రైతులు 63వ జాతీయ రహదారిపై మంగళవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కాంటా పెట్టడం లేదని, కాంట అయిన ధాన్యాన్ని సైతం కింద పోయించి 17 శాతంతో కాంటా అయిన వాటికి తేమ శాతం 15 రావాలని కొర్రీలు పెడుతూ 2 కిలోల కడ్తా తీస్తున్నారని వాపోయారు. అకాల వర్షానికి వడ్లన్ని రాలిపోయి ఆవేదనతో ఉన్న రైతులను సొసైటీ సిబ్బంది ఈ విధంగా ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కడ్త లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో ఇరు వైపులా వాహనాలు బారులు తీరాయి. సమాచారం అందుకున్న పోలీసులు రైతులను సముదా యించడంతో వారు శాంతించి రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో పటేవార్ తూర్పు రాజు, ఓంప్రకాష్, కే. రాజేందర్, కే. బాలు సుమారు 50 మంది రైతులు పాల్గొన్నారు.

హైదరాబాద్ సంస్థాన్ ఉద్యమకారుని మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్/కమ్మర్‌పల్లి



హైదరాబాద్ సంస్థాన విమోచన ఉద్యమకారుడు ముత్యాల హన్మంత్‌రెడ్డి (95) మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య దేవగంగ గతంలో పరమపదించారు. కుమారులు రమేశ్ రెడ్డి, కృష్ణ రెడ్డి, మురళీధర్ రెడ్డి, కుమార్తె పద్మారెడ్డి ఉన్నారు. కమ్మర్‌పల్లి మండలం హసకొత్తూర్ గ్రామానికి చెందిన ఆయన నిజాం సర్కారుకు వ్యతిరేకంగా పోరాటం చేసిన నాటి పోరాట యోధులు నిజామాబాద్, కంఠేశ్వర్ ప్రాంతానికి చెందిన జె.హన్మంత్ రెడ్డి, కామారెడ్డి వెంకట్ రెడ్డిలతో కలిసి పోరాడారు. యువకుడిగా ఉన్నప్పుడే నిజామాబాద్ జిల్లా జైలులో, చంచల్ గూడ జైలులో జైలుజీవితం గడిపారు. హైదరాబాద్ సంస్థానం 18 సెప్టెంబర్, 1948లో భారత యూనియన్ లో విలీనం అయిన తరువాత హసకొత్తూర్ గ్రామ సర్పంచ్ గా ఇరవై ఏండ్ల పాటు విధులు నిర్వహించారు. తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా మహాసభలలో ముఖ్యఅతిథిగా పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డ్ చైర్మన్ వుమ్మన్నగారి దేవేందర్ రెడ్డి గంగాస్థాన్-2 లో గల హన్మంత్ రెడ్డి నివాసంలో పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. తెలంగాణ సంస్థాన తొలితరం ఉద్యమకారుడి కోల్పోవడం విషాదకరమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్ రెడ్డి, నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, ప్రధాన కార్యదర్శి భాగి చరణ్ హన్మంత్ రెడ్డి భౌతిక కాయానికి పూలతో నివాళులు అర్పించారు. గుపన్ పల్లి శివారులో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

మా కుతురుది సూసైడ్ కాదు... మర్డర్

- కొట్టేసిన కేసు ఓపెన్ చేసి విచారణ చేయించండి : తల్లిదండ్రుల ప్రెస్‌మీట్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తమ కూతురు సూసైడ్ చేసుకోలేదని, మర్డర్ చేశారని తల్లిదండ్రులు ఆరోపించారు. కేసును రీ ఓపెన్ చేసి విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు మెదక్ జిల్లా రామాయంపేట్‌కు చెందిన తల్లిదండ్రులు ప్రదీప్ కుమార్, జాలిన్ మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మా పాప అక్షిత పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించగా నిజామాబాద్ నగరంలోని ఓ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చేర్పించామని తెలిపారు. ముబారక్‌నగర్‌లోని శ్రీ నిధి ప్రైవేట్ హాస్టల్‌లో చేర్పించామని, చేర్పించిన మూడు నెలలకు 2022 నవంబర్ 13వ తేదీనా మా పాప హాస్టల్ బిల్డింగ్ పై నుంచి దూకి చనిపోయిందని మాకు ఫోన్ చేసి హాస్టల్ వారు చెప్పారన్నారు. చనిపోయిన గంట తరువాత ఫోన్ చేశారని, మేము వచ్చే సరికి ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నట్టుగా చిత్రీకరించారని అప్పడికే మా పాప చనిపోయిందని అన్నారు. కేసును రీ ఓపెన్ చేసి విచారణ చేపట్టాలని కోరారు.

కాగా ఈ విషయమై రూరల్ సీఐ నరహరి స్పందించారు. అక్షితది ముమ్మాటికి ఆత్మహత్యే అని, తమ వద్ద అన్ని ఆధారాలూ ఉన్నాయని, హాస్టల్ వారి నుంచి డబ్బులు ఇప్పించలేదనే తమపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

మా పంచాయతీ కార్యదర్శి మాకు కావాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



పంచాయతీ కార్యాలయానికి తాళం వేస్తున్న సర్పంచ్

గత నాలుగు సంవత్సరాల నుండి గ్రామ అభివృద్ధి ఎంతో తోడ్పడుతున్న మా పంచాయతీ కార్యదర్శి మాకు కావాలి అని కొత్తగా వచ్చినా ఇంచార్జ్ లు మాకు వద్దు అని ఎల్లారెడ్డి మండలాల్లో పలు గ్రామ పంచాయ తీల కార్యదర్శులను ఆయా గ్రామ సర్పంచ్‌లు అడ్డుకున్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఐదురోజులుగా వారు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో గ్రామాలలో అభివృద్ధి పనులు నిలిచి పోకుండా కొనసాగించడానికి అధికారులు రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లను, మండల్ పరిషత్ కార్యాయంలో పనిచేస్తున్న సిబ్బందిని ఇంఛార్జి సెక్రెటరీగా బాధ్యతలు అప్పగించారు. దీంతో గ్రామాల్లోకి వెళ్లిన ఇంఛార్జి కార్యదర్శులను సర్పంచులు మీరు మాకు వద్దు అని పాత కార్యదర్శులు కావాలని కోరుతున్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ డిమాండ్

నవతెలంగాణ-కామారెడ్డిడెస్క్

అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా సుమారు 40,000 ఎకరాలకు పైగా వరి పంట నష్ట పోయినట్టు తెలిపారు. 15000 ఎకరాలపైగా మొక్కజొన్న ఇతర పంటలు నష్టపోయాయని, నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు రైతుల వద్దకు వెళ్లి సర్వే చేసి అర్హులైన రైతులకు అందరికీ న్యాయం చేయాలని కోరారు.

అదేవిధంగా కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యం వర్షానికి కొట్టుకుపోయిందని కొంత తడిసిపోయిందని తడిసిన ధాన్యాన్ని తేమ శాతం లేకుండా ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేపట్టాలని 17 శాతం ఉన్న శాతాన్ని 25 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతిరోజు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒకరి మీద ఒకరు తిట్టుకోవడం కంటే కేంద్ర బీజేపీ నుండి ప్రభుత్వం నుండి 25 వేల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం నుండి 25 వేల రూపాయలు ఎకరానికి చొప్పున తక్షణ నష్టపోయిన రైతాంగానికి ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కోర్ కమిటీ సభ్యులు మోతిరాం నాయక్, చంద్రశేఖర్, అరుణ్, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.



మెమోరాండం అందజేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

కనీస వేతనం రూ. 18వేలు చెల్లించండి

- కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున వీవోఏల ధర్నా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వీవోఏ

కనీస వేతనం 18 వేలు అమలు, తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీవోఏలు డిమాండ్ చేశారు. తెలంగాణ ఐకేపీ వీవోఏ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు మంగళవారం భారీ ర్యాలీ చేపట్టి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదంటూ నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు తమ సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కే.పోశెట్టి, ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్ నాయక్ మాట్లాడారు. విఓఏలకు 10 లక్షల రూపాయల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. వి.ఓ.ఏ. లకు గౌరవ వేతనం డిఆర్డిఏ శాఖా అకౌంట్ ను నేరుగా ఖాతా లో జమ చేయాలని, జి.ఓ నెం 58 ను సవరిస్తూ అనుబంధం-5 ను రద్దు చేసి 3 సంవత్సరాలకు ఒక్క సారి పున్హరుద్దరణ చేయాలని కోరారు. వి.ఓ.ఏ.లకు స్త్రీ నిధి నుండి ఇన్సెంటివ్ రద్దు చేసి అక్కడ నుండి గౌరవ వేతనం నెలకు 5000 రూపాయలు ఇప్పించాలని, సెర్ప్ నుండి ఐడి కార్డులు ఇప్పించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జాబ్ చాట్ డిక్లరేషన్ చేయాలని కోరారు.

బాల్యవివాహాలను రూపుమాపాలి

అనాథ పిల్లల వివరాలు సేకరించాలి : కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

బాల్యవివా హాలను రూపుమాపాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం బాల రక్షా భవన్ కన్వర్జేషన్ మీటింగ్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న అనాధ పిల్లల వివరాలను అంగన్‌వాడీ కార్యకర్తలు సేకరించాలని సూచించారు. అనాథ పిల్లలకు ధ్రువీకరణ పత్రం వచ్చిందా లేదా తెలుసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో అనాథ పిల్లల కోసం సీట్లు ఉంటాయని చెప్పారు. అనాథ పిల్లలు వసతి గృహాల్లో ఉండి ఉన్నత విద్యను పూర్తిచేసే విధంగా అధికారులు చూడాలని పేర్కొన్నారు. ఎవరైనా పిల్లలను భిక్షాటన చేయిస్తే వారిని పట్టుకుని చట్టారీత్యా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పదవ తరగతి పూర్తి చేసిన అనాధ బాలికలు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని అనాధ బాలికలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ అన్యోన్య, జిల్లా బాలల అభివృద్ధి అధికారిని స్రవంతి, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి వెంకటేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్య రక్షణ పథకం..

పక్కాగా అమలు కావాలి

అడిషనల్ కలెక్టర్ శివేందర్ ప్రతాప్

నవతెలంగాణ-నసురుల్లాబాద్



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న అధికార

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళ ఆరోగ్య రక్షణ పథకం పక్క అమలు జరిగేలా చూడాలని కామారెడ్డి జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శివేందర్ ప్రతాప్ తెలిపారు. మంగళ వారం బీర్కూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రికి సంబంధించిన ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ , ఆస్పత్రి వైద్య ఆరోగ్య సిబ్బంది రిజిస్టర్ లను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలపై డాక్టర్ శ్రీలేఖకు అడిగి తెలుసుకున్నారు. బీర్కూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ పథకం అమలుపై డాక్టర్ శ్రీలేఖను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర మహిళల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ పథకమును పక్కగా అమలు జరిగేలా వైద్యులు చూడాలని, వచ్చి వెళ్లే వ్యాధిగ్రస్తులకు వైద్య ఆరోగ్య సిబ్బంది సహకరించి ఆరోగ్య మహిళా పథకం పక్కగా అమలు జరిగేలా చూడాలన్నారు. 8 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్టు తెలిపారు. వీరి వెంట, ఎంపీడీవో భాను ప్రకాష్, వైద్యాధికారిణి శ్రీలేఖ పరిద్య ఆరోగ్య సిహెచ్ఓ రవీందర్ వైద్య ఆరోగ్య సూపర్వైజర్లు ఆరోగ్య కార్యకర్తలు ఆశ వర్కర్లు తదితరులు ఉన్నారు.

ప్రతి ధాన్యపు గింజనూ కొంటాం

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-కోటగిరి



వడ్లను పరిశీలిస్తున్న స్పీకర్

ధాన్యం తడిచిన రైతులు ఆందోళన చెందొద్దని, పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళ వారం మండలంలోని కల్లూరు, జల్లపల్లి తదితర గ్రామాలలో రహదారిపై ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి భరోసా కల్పించారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వరి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు జూన్‌లో వరి నాటుకోవాలని, అక్టోబర్‌లో పంట కోతకు వస్తుందని ప్రకృతి వైపరీత్యం కొంతవరకు మనకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. సీఎం కేసీఆర్ పుణ్యం వల్ల నిజాంసాగర్‌కు రెండు పంటలకు సాగునీరు కాళేశ్వరం ద్వారా అందుతుందని కావున రైతులు ముందస్తుగా వరి నాట్లు వేసుకుంటే పంట ముందే చేతికి వస్తుందని, ఈ సమయంలో అకాల వర్షాలతో నష్టం వాటిల్లే అవకాశం ఉండదని అన్నారు. స్పీకర్ వెంట అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, డిసిఓ సింహాచలం స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-సదాశివనగర్/తాడ్వాయి/గాంధారి



నియోజకవర్గంలోని పలువురుకి మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే జాజాల సురేందర్ మంగళవారం పంపిణీ చేశారు. తన సొంత డబ్బులతో ఆడబిడ్డకు సారే అందించారు. సదాశివనగర్ మండలం వ్యాప్తంగా 130 చెక్కులను మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో లబ్దిదారులకు అందజేశారు. తాడ్వాయి మండల కేంద్రంలోని రైతు వేదికలో 14 గ్రామాలకు చెందిన కళ్యాణ లక్ష్మి చెక్కులను 39 మందికి పంపిణీ చేశారు. గాంధారి మండల కేంద్రంలోని రైతు వేదికలో 48 మందికి కల్యాణలక్ష్మి, 63 మంది సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, తహసీల్దార్‌లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, నాయకులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఖలీం

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ యువకుడు గొంతు కోసుకొని ఆత్మహత్యయత్నం చేసిన ఘటన సోమవారం చోటుచేసుకోగా.. మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని నిజాం కాలనీకి చెందిన ఖలీం(21) ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్‌లో పారిశుధ్య కార్మికుడిగా పని చేసినట్టు సమాచారం. కరోనా కంటే ముందు విధుల నుంచి తొలగించినట్టు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. కాగా ఆమె తల్లి మున్ని సైతం స్వీపర్‌గా పని చేస్తుండగా.. ఇటీవల విధులకు రావొద్దని కాంట్రాక్టర్ చెప్పినట్టు సమాచారం. 25 ఏండ్లుగా స్వీపర్‌గా పని చేస్తున్న తన తల్లిని విధులకు ఎందుకు రానివ్వడంలేదని అడిగేందుకు ఆయన రాగా.. ఎవరూ స్పందించకపోవడంతో ఆస్పత్రిలో సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట బ్లేడ్‌తో గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన సిబ్బంది హుటాహుటిన ఎమర్జెన్సీ వార్డుకు తరలించి చికిత్స అందజేశారు. కార్మిక దినోత్సవం మే డే రోజు ఈ ఘటన చోటుచేసుకోవడం కలకలం రేపింది. అయితే తన కొడుకుకు మతిస్థిమితం సరిగ్గా లేదని ఆయన తల్లి మున్ని పేర్కొనడం గమనార్హం.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నవతెలంగాణ-మాక్లూర్

పెయింటింగ్ వేస్తుండగా కిందపడి గాయపడ్డ ఓయువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. సోమవారం మండలంలోని మాణిక్ బండర్ గ్రామ శివారులో గల నవ్యభారతి స్కూల్ లోని 4వ అంతస్థులో పెయింటింగ్ వేస్తుండగా యువకుడు కింద పడ్డాడు. స్థానికులు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడు మండలంలోని అమ్రాద్ గ్రామానికి చెందిన నిమ్మ రాజు (23). మృతుని తండ్రి విదేశాల్లో ఉన్నాడని, తండ్రి వచ్చిన తరువాత బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తారని గ్రామస్థులు తెలిపారు.

జిల్లా కేంద్రానికి తరలిన వీవోఏలు

నవతెలంగాణ-ముప్కాల్



వీవోఏలు తమ డిమాండ్ల సాధనకు మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి బయల్దేరి వెళ్లారు. గ్రామీణాభివృద్ధి శాఖ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ముప్కాల్ మండల అధ్యక్షురాలు అరుణ, వీవోఏలు భాగ్యలక్ష్మి, కావ్య, అర్చన, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

రెగ్యూలర్ చేసే వరకూ సమ్మె

- కొనసాగుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె
- పలుపార్టీల నాయకుల మద్దతు • ఐదోరోజు కొనసాగిన సమ్మె

తమ డిమాండ్లను నెరవేర్చాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెలో భాగంగా ఐదోరోజు మంగళవారం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. లేదంటే ఈనెల 5నుంచి సమ్మె చేపడతామని తెలిపారు. వీరికి పలుపార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

నవతెలంగాణ-విలేకరులు



ఆర్మూర్‌లో..

బోధన్:జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పోస్టులను ప్రభుత్వం తక్షణమే పర్మినెంట్ చేయాలని కోరుతూ బోధన్ మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు టిఎంఆర్పిఎస్ నాయకులు విద్యాసాగర్, గ్రామపంచాయతీ సిబ్బంది , పంచాయతీ కార్యదర్శులు తమ సంఘీభావం తెలిపారు. అనంతరం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల శిక్షణ కాలాన్ని సర్వీస్ కాలంగా పరిగణిస్తూ తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఓపిఎస్ లను జేపీఎస్ లు గా రెగ్యులర్ చేయాలని, రాష్ట్ర స్థాయిలో పంచాయతీ కార్యదర్శుల క్యాడర్ స్ట్రెంత్ నిర్ధారించి ప్రకటించాలని, అలాగే విధి నిర్వహణలో మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి, కారుణ్య నియామకంలో భాగంగా వారి కుటుంబంలో ఉద్యోగం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శులకు మద్దతుగా పలువురు చిన్నారులు సైతం పాల్గొన్నారు. సమ్మెలో పంచాయతీ కార్యదర్శులు శైలజ, రాజీవ్ గాంధీ, సుధాకర్, మహేందర్ ,హరిత, బాలకృష్ణ గంగామణి పృథ్వీరాజ్, సతీష్, మహేందర్, విశ్వనాథ్,రవి తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి:నాలుగు సంవత్సరాలుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా విధులను నిర్వహిస్తూ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమంలో పాల్గొంటున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మె చేపడుతున్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కు ప్రొబేషన్ ప్రొఫెషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా పరిగణించాలన్నారు.. కార్యదర్శులు చేపడుతున్న దీక్ష శిబిరాన్ని ఎడపల్లి మండల సిఐటియు కార్యదర్శి జంగం గంగాధర్ సందర్శించి మద్దతు పలికారు. సమ్మెలో రాజేశ్వర్ (ఎడపల్లి), రామ్ రెడ్డి (మంగల్‌పహాడ్) సాయి కమార్ యాదవ్, (దుబ్బ తండ) గంగాధర్ (వడ్డేపల్లి,), స్వర్ణలత (బాపునగర్), పద్మావతి (ధర్మారం), పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ధర్పల్లి:జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యల పరిష్కరించాలని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి వినతి పత్రాన్ని అందించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించడం లేదని అన్నారు. కార్యక్రమంలో సుమన్, సాయికుమార్, రాజ్ కుమార్, ఇలియాస్, మానస, అశోక్, కార్తీక్, దిలీప్, బాలకృష్ణ, తిరుపతి, విజయ్, రఘురాం, ప్రవీణ్, శ్రీహరి, స్వరూప, తదితరులు పాల్గొన్నారు,

వర్ని:జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని సీపీఎం వర్ని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. వర్ని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న జూనియర్ కార్యదర్శులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. నాలుగు సంవత్సరాలుగా కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్నా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పేరుతో కొనసాగించడం బాధాకరమన్నారు. జూనియర్ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యదర్శులు రోడ్డుమీదికి రాకముందే సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే జూనియర్ కార్యదర్శులతో కలిసి సీపీఎం పార్టీ ప్రత్యక్ష పోరాటానికి దిగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాయి బాబు, గాయత్రి, సురేష్, సావిత్రి, భూమిక కార్యదర్శులు శ్రావణ్ కుమార్, మీనాజ్, శివ, వినోద్, ముస్తాఖ్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ:తమ సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ జూనియర్ కార్యదర్శులు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం గ్రామపంచాయతీ జూనియర్ కార్యదర్శుల అసోసియేషన్ మండల అధ్యక్షుడు కనగందుల శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రొబిషనరి కాలాన్ని నాలుగు సంవత్సరాలు సర్వీస్ గా గుర్తిస్తూ, సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ ఇవ్వాలని, ఓపీసిలను వెంటనే జేపీఎస్ లుగా మార్చి, రెగ్యులర్ చేయాలని, మరణించిన జెపిఎస్ కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి సుమన్, జూనియర్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముప్కాల్:తమ ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరణ చేయాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు.. ఈ సందర్భంగా వారు మండల ప్రజాపరిషత్ కార్యాలయం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర ద్వారా తమ నిరసన ప్రదర్శనలను తెలియజేశారు. వారి సమ్మెకు మద్దతుగా కారోబార్లు, సఫాయి కార్మికులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శిలు భరత్ స్వరూప్, శంకర్, వనజ, గౌతమి, రాజ్యలక్ష్మి, వనిత, రవి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్: ఎంపీడీవో కార్యాలయం ముందు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె కొనసాగుతోంది. స్థానికంగానే ఉంటూ పన్నుల వసూలు, తాగునీటి సరఫరా, డంపింగ్ యార్డ్ నిర్వహణతో పాటు ఇతరత్రా పనులు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షులు దేవేందర్, సుకన్య సౌందర్య, శ్వేత, రమ, ప్రసాద్ సురేష్ ఎస్.కె నాసిర్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నందిపేట్ :మండల పరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్య దర్శుల నిరసన కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా జాబ్ చాట్ ముగ్గు వేసి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించే వరకు నిరసన తప్పదని వారు హెచ్చ రించారు.



రెగ్యులర్‌చేయాలని ప్లకార్డుతో చిన్నారి



ధర్పల్లి : ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు



బోధన్‌లో..

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

- ఎంపీడీవో, ఎంపీవోకు వినతి

నవతెలంగాణ-ఏర్గట్ల



వినతిపత్రం అందజేస్తున్న కారోబార్లు, సిబ్బంది

మండలానికి చెందిన పంచాయతీ కారోబార్లు, సిబ్బంది ఎంపీడీఓ రాజేశం, ఎంపీఓ శివ చరణ్‌కు సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కారోబార్లు, సిబ్బంది మండలాధ్యక్షులు సాయన్న మాట్లాడుతూ... ఈ నెల 5 వరకు తమ న్యాయపరమైన సమస్యలపై స్పందించకపోతే సమ్మెకు దిగుతామని అన్నారు. కార్యక్రమంలో టీజేకేఎస్‌యూ.రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుక మారుతి, సంయుక్త కార్యదర్శి జె.సాయన్న, కారోబార్లు హన్మాండ్లు, రాకేష్, రఫీక్, మనోజ్, సపాయి సిబ్బంది, వాటర్ మెన్లు, డ్రైవర్లు, ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉద్యోగులకు వేసవి సెలవులు ఇవ్వాలి

డిటిఎఫ్ డిమాండ్

నవతెలంగాణ-ఆర్మూర్

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వేసవి సెలవులు ఇవ్వకుండా ప్రతిరోజు పాఠశాలకు వెళ్లాలని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు అధికారి ఆదేశాలు జారీ చేయడం సరికాదని, అన్ని పాఠశాలలో మాదిరిగా కేజీబీవీ ఉపాధ్యాయులు ఉద్యోగులకు కూడా వేసవి సెలవు ఇవ్వాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. బాలయ్య ,ఆర్. రాజన్నలు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు రెసిడెన్షియల్ పద్ధతిలో నడుస్తున్నందున అందులో పనిచేసే మహిళా ఉపాధ్యాయులను ఇప్పటికే సెలవు దినాల్లో, పండగ రోజుల్లో నైట్ డ్యూటీ పేరుతో కూడా అనేక రకాల విధులు నిర్వహిస్తూ తీవ్రమైన పని ఒత్తిడికి లోనవుతున్నారని పేర్కొన్నారు. ఇది చాలా దన్నట్టు విద్యార్థులు లేనప్పటికీ వేసవిలో కూడా ఉపాధ్యాయులు ప్రతిరోజు పాఠశాలకు హాజరుకావాలని హుకుమ్ జారీ చేయడం విరమించుకోవాలని కోరారు. పాఠశాల విద్యా రంగం వెకేషన్ డిపార్ట్మెంట్ అని మిగతా ఉద్యోగుల్ల కాకుండా విద్యాలయాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు వేసవి సెలవులు ఉండాలని తెలిపారు.

ఇండియన్ డాన్స్ ఫెస్టివల్‌కు నటరాజ నృత్యానికేతన్ విద్యార్థులకు ఆహ్వానం

నవతెలంగాణ-ఆర్మూర్

12 సంవత్సరాలుగా ఎన్నో రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ నృత్యాలతో ఆకట్టుకున్న పట్టణానికికు చెందిన నటరాజ నృత్యానికేతన్ విద్యార్థులకు మలేషియా తెలుగు అసోసియేషన్ నుండి ఆహ్వానం అందింది. మలేషియా తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియన్ డాన్స్ ఫెస్టివల్‌లో పాల్గొనే అరుదైన అవకాశం లభించింది. నృత్య గురువు భాశెట్టి మృణాళిని ఆధ్వర్యంలో సాయి శృతి, తన్వి, మృదుల, దేవాన్షి, దీక్షిత, సుదీప్తి, తనవి బృందం నేడు మలేషియా బయలుదేరి వెళ్తున్నారు. మే ఆరవ తేదీన మలేషియాలోని తన్ శ్రీధత్తో ఆడిటోరియంలో ఆంధ్ర కూచిపూడి నాట్య ప్రదర్శనలతో తమ ప్రతిభను చాటబోతున్నారు. గతంలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్న ఈ విద్యార్థులు మలేషియా తెలుగు అసోసియేషన్ వారి ఆహ్వానం అందుకోవడం ఆనందంగా ఉందని, ఇండియన్ డాన్స్ ఫెస్టివల్ లాంటి అంతర్జాతీయ వేదిక పైన తమ నాట్యాన్ని ప్రదర్శించే అవకాశం లభించడం సంతోషకరమైన విషయమని నాట్య గురువు మృణాళిని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

నీరడి రవికుమార్‌కు దళితరత్న అవార్డు



రవికుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని పోచారం గ్రామానికి చెందిన సమాజ సేవ చేస్తున్న దూపల్లి సహకార సంఘం డైరెక్టర్ నీరడీ రవికుమార్‌కు దళిత రత్న అవార్డును ప్రభుత్వం అందజేసింది. బాబు జగ్జీవన్ రావ్ జయంతి రోజునే హైదరాబాదులోని రవీంద్ర భారతిలో నీరడి రవికుమార్ అనివార్య కారణాల వల్ల అందుకోలేకపోయారు. నిజామాబాద్ నగర మేయర్ దండు నీ తు కిరణ్ శేఖర్, చేతుల మీదుగా రవికుమార్‌కు దళిత రత్న అవార్డు ను అందజేసి నిజామాబాద్‌లో ఘనంగా సన్మానించినట్లు పోచారం గ్రామస్తులు తెలిపారు. మంగళవారంగ్రామపంచాయతీ కార్యాలయం వద్ద డాక్టర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో యువకులు, నాయకులు, సంఘాల పెద్దలు నీరడీ రవికుమార్‌కు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కట్ట సంతోష్, కోల విజయ్, రవి, లక్ష్మయ్య, తాడెం అబ్బయ్య, భూమన్న పర్సన్స్, చిన్న గంగారాం, యువకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాల ఊరేగింపు

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో గౌడ కుల సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా కుల సంఘం సభ్యులు ఇంటికొక్కరి చొప్పున మహిళలు బోనాలతో, మంగళహారతులతో,గౌడ శెట్టిల నృత్యాలతో ఎల్లమ్మ తల్లి ఆలయం వరకు ఊరేగింపు చేపట్టి బోనాలను సమర్పించారు. అనంతరం గౌడ కుల సంఘం సభ్యులు, కుటుంబ సభ్యులతో ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, పండుగను ప్రశాంతంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజ గణేష్ గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, రాజ గౌడ్, రాజేందర్ గౌడ్, హనుమ గౌడ్, రాజేందర్ గౌడ్ ,రాజా గౌడ్, శివగౌడ్, నాగభూషణ్‌గౌడ్, రామస్వామిగౌడ్, రాములు గౌడ్, ప్రకాష్‌గౌడ్, బల్లంగౌడ్, పెద్దరాజు గౌడ్, పెంటయ్య గౌడ్, చిన్న రాజు గౌడ్, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కారోబార్ల సమ్మె నోటీస్

నవతెలంగాణ - బోధన్

ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్, స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో బోధన్ ఎం పి ఓ మధుకర్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారోబార్లను, బిల్ కలెక్టర్లను అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శిగా ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 21,500 చెల్లించాలని, (51 జీవో సవరించి కెటగిరీల వారిగా హోదా కల్పించి చ ఉద్యోగ భద్రత కల్పించి, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. నేరుగా వేతనాలు ప్రభుత్వమే సిబ్బంది అకౌంట్లో వేయాలని, పీఎఫ్, ఇ.ఎస్.ఐ సౌకర్యం కల్పించాలని, మరణించిన వారి కుటుంబంలోఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, పెండిగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి రూ. 10 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.లేని ఎడల ఈ నెల 5 వ తేది నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షులు గణేష్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, సెక్రెటరీ శరత్, కోశాధికారి పోశెట్టి ,వీరేశం, బాలకృష్ణ, శివయ్య, నాగనాథ్, లింగం, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆర్మూర్



కంటి వెలుగు పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని చేపూర్ సర్పంచ్ ఇందూర్ సాయన్న అన్నారు. మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నడుకుడ శ్రీనివాస్ , ఎంపిటిసి బాల నరసయ్య వార్డు సభ్యులు, కంటి వెలుగు హెల్త్ హుమెర యాసిన్, రవీందర్ సూపర్వైజర్, సుల్తానా బేగం ఏఎన్ఎం ఆశ వర్కర్లు, విడిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు

రేషన్ షాపుల ద్వారా 12 రకాల నిత్యావసరాలు అందించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజలకు రేషన్ షాపుల ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, సన్నబియ్యం ఇవ్వాలని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రగతిశీల యువజన సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో నిజామాబాద్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు వి.గోదావరి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బి.కిషన్ మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో నిత్యావసర ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వాలు 9 రకాల నిత్యావసర సరుకులు ఇచ్చేవని ఇప్పుడు ఇవ్వడంలేదన్నారు. ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, కావున 12 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 5 కేజీల బియ్యంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం కూడా 5 కేజీలు ఇవ్వాలని కోరారు. వంటగ్యాస్‌ను సగం సబ్సిడీతో ఇవ్వాలని తెలిపారు.

ఎమ్మెల్యేలకు ఎలాగో చిత్తశుద్ధి లేదు.. అధికారులారా.. మీరైనా స్పందించండి

- అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎమ్మెల్యేలకు ఎలాగో చిత్తశుద్ధి లేదు.. అధికారులారా మీరైనా రైతుల పట్ల స్పందించాలని, వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, జిల్లా కిసాన్‌ఖేత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పగంగారెడ్డి కలిసి వడగండ్ల వానకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మానాలమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో మంత్రి, ఎమ్మెల్యేలు రైతుల కష్టాలు పట్టనట్టు ఉంటున్నారని, ఒక ఎమ్మెల్యే పార్టీ ప్లీనరీలు చేసుకుంటూ, మరో ఇద్దరు ఎమ్మెల్యేలు మహారాష్ట్రలో బిఆర్ఎస్ పార్టీ సభలు నిర్వహించుకుంటూ, ప్రజల సమస్యలు తీర్చాల్సిన మంత్రి ఢిల్లీ, హైదరాబాద్ పార్టీ భవన నిర్మాణాల్లో తిరుగుతున్నారని విమర్శించారు. ా రాళ్లవానకు పొలంలో వడ్లు రాలిపోయి రైతులు బాధపడుతున్నారని, కొనుగోలు కేంద్రాల్లోని వడ్లునీళ్లలో కొట్టుకుపోయిన పరిస్థితి ఉందని తెలిపారు. పూర్తిగా నష్టపోయిన రైతులకు ఎకరానికి 50 వేల రూపాయల నష్టపరిహారం అందించాలని, పంట రుణాలను రద్దు చేయాలని, దీర్ఘకాలిక రుణాలకు ఈ సంవత్సరంలో చెల్లించే కిస్తీలను రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోకపోతే ఆందోళనకు సిద్ధమవుతావని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్యుఐ అధ్యక్షులు వేణు రాజ్, కార్పొరేటర్ ఘడుగు రోహిత్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, డిసిసి డెలిగేట్ పవన్, వహీద్ ,నవాజ్, అష్రఫ్, అర్షద్, అక్షయ్, ఆర్యన్ తదితరులు పాల్గొన్నారు.

7న ఆదివాసి నాయకపోడు సేవా సంఘం ఎన్నికలు

నవతెలంగాణ- ఆర్మూర్

ఆదివాసి నాయక పోడు సేవా సంఘం ఎన్నికలు పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో గల తాజ్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 7 ఆదివారం నిర్వహించనున్నట్లు గౌరవ అధ్యక్షులు బండారి భోజన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామం నుండి కులం పెద్ద మనుషులు ఎంపీటీసీలు ,సర్పంచులు, ఉన్నత ఉద్యోగులు హాజరు కావాలని పేర్కొన్నారు. జిల్లా సంఘం అభివృద్ధికి ప్రతి సంవత్సరం మాదిరిగానే కుటుంబానికి వంద రూపాయలు సభ్యత్వం తీసుకోవాలని కోరారు.

పోరాటాలతోనే హక్కులు సాధించుకోవచ్చు

రామచంద్రపల్లిలో మేడే జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-మాక్లూర్



జెండా ఎగురవేస్తున్న నాయకులు

మండలంలోని రామచంద్రపల్లి గ్రామ శివారులోని ఒడ్డెర కాలనీలో ఒడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శి ఇడగొట్టి సాయిలు జెండా ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఒడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు విడగొట్టు సాయిలు మాట్లాడుతూ సంఘం అందరి సహకారంతోటే బలపడుతుందన్నారు. పెద్ది వెంకట రాములు మాట్లాడుతూ కార్మికుల ఐకమత్యంగా ఉండాలని అన్నారు. 20 గంటల పని దినాలను ఎనిమిది గంటలుగా కొనసాగించు కోవడానికి అనేక పోరాటాల ద్వారానే సాధ్యమైందన్నారు. ఎర్రజెండా సహకారంతో చట్టాలను మనం కాపాడుకోవాల్సిన బాధ్యత మన పైన ఉందన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ ఆనాటి పోరాట ఫలితంగానే కార్మికులు హక్కులు సాధించుకున్నా రన్నారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్ మాట్లాడుతూ వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలని పోరాటం ద్వారానే ఇవన్నీ సాధించుకున్నామని తెలిపారు. రామచంద్ర పల్లిలో వడ్డెర వృత్తిదారుల ఇళ్ల స్థలాలు, పట్టాలు, నీటి సౌకర్యం, రోడ్డు, రవాణా సౌకర్యం పోరాట ఫలితంగానే వచ్చాయన్నారు. కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం సభ్యులు, జిల్లా ఉపాధ్యక్షులు ఇడగొట్టి వడ్డెన్న, జిల్లా కమిటీ సభ్యులు ముద్దంగుల రమేష్, కంది ఎల్లయ్య, రమేష్, గండ్ల నర్సయ్య, కాలనీవాసులు, మహిళలు 150 సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రైతులు దిగులు చెందొద్దు

జాకోర పిఎసిఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి

నవతెలంగాణ-వర్ని



మండలంలోని జాకోర సహకార సంఘం పరిధిలోగల సైదిమల్, సిద్దాపూర్, సైదుపూర్, జలాల్పూర్ పలు గ్రామాల రైతులు పండించిన మొక్కజొన్న, వరి ధాన్యాన్ని జాకోర సహకార సంఘం ద్వారా కొనుగోలు చేస్తామని మంగళవారం చైర్మన్ కృష్ణారెడ్డి తెలిపారు. డీసీసిబి చైర్మన్ భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు తమ పరిధిలో ఉన్న ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు. అందుకు రైతులు సహకరించాలని ధాన్యం ఆరబెట్టే ప్రయత్నంలో రైతులు ప్రయత్నం చేయాలని కోరారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా గోనె సంచులు, ఇతర సామగ్రి సిద్ధంగా ఉన్నాయని,ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

జూనియర్ కార్యదర్శుల డిమాండ్లు నెరవేర్చాలి

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని తడిసిన వరి ధాన్యాన్ని కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జి కాసుల బాలరాజ్, కాంగ్రెస్ నాయకులు కొట్టం మనోహర్, గంగాధర్ దేశాయ్ తదితరులు మంగళవారం పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. అనంతరం సమ్మె చేస్తున్న జూనియర్ కార్యదర్శులకు సంఘీభావం తెలిపారు. వారి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే తీర్చాలని అన్నారు. బంగారు తెలంగాణలో ప్రతి ఒక్కరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

నిరవధిక సమ్మెలోకి కారోబార్లు

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో మంగళవారం ఎంపీడీవో మనోహర్ రెడ్డికి మండల కారోబార్లు ఈనెల 5నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు ఎంపీడీఓకు వినతి పత్రం సమర్పించారు ఉద్యోగ భద్రత , పిఎఫ్ సౌకర్యం కలిగించాలని 2019లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు మండల అధ్యక్షురాలు రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

యువ రైతుకు ఘన సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



యువరైతులను సన్మానిస్తున్న సర్పంచ్, అధికారులు

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన యువ రైతు యాల్ల నవీన్ ను స్థానిక రైతు వేదిక భవనంలో మంగళవారం వ్యవసాయ శాఖ, యువమిత్ర యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పసుపు పంటలో రికార్డు స్థాయిలో ఎకరంన్నర తోటలోనే 85 క్వింటాళ్ల పంట దిగుబడి సాధించినందుకు యువ రైతు యాల్ల నవీన్‌ను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బద్దం పద్మచిన్నారెడ్డి మాట్లాడుతూ సంప్రదాయ పంటగా పండిస్తున్న పసుపు పంటను ప్రతిఏటా తగ్గిస్తూ వస్తున్న తరుణంలో యాల్ల నవీన్ అందరి రైతులకు ఆదర్శంగా నిలిచాడన్నారు. ఇదేవిధంగా మంచి దిగుబడులు సాధించడం ద్వారా జాతీయ ఉత్తమ రైతుగా పేరు ప్రఖ్యాతలు సాధించి గ్రామానికి కూడా పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పిప్పెర అనిల్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి రమేష్, యువ మిత్ర యూత్ సభ్యులు హరీష్, సుంకరి విజయ్, గ్రామ రైతులు సత్యం, రాజేశ్వర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ

కామారెడ్డి

3

బుధవారం 03 మే 2023

కొనుగోలు కేంద్రాలతో మద్దతు ధర



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న చైర్మన్

నవతెలంగాణ-పిట్లం

వరి ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించి లబ్ధి పొందాలని చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నకొడప్‌గల్‌లో సింగిల్ విండో ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోకుండా రైతుల అభివృద్ధికి గాను ప్రభుత్వము ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను లబ్ధి పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, రైతులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభ్యత్వం ఇన్సూరెన్స్ కార్డులు అందజేత



కార్డులు అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని కన్నాపూర్ తండాలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ ఇన్సూరెన్స్ కార్డులను, కార్యకర్తలకు గ్రామ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్కరికి ప్రమాద బీమా కలిగిన కార్డులను అందజేస్తున్నామని, ప్రతి కార్యకర్త కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి, ప్రజల పక్షాన నిలవాలని అన్నారు. కార్యక్రమంలో పరశురాం, రాజు, సీతారాం, జోహార్, లాల్ దరి, శంకర్, సంతోష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలించిన ఆర్డీవో



కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న ఆర్డీవో, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలో రైతు వేదిక వద్ద కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం తూకం వేయాలని, తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని తూకం వేయాలని సెంటర్ ఇన్‌చార్జిలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, డైరెక్టర్లు, సీఈవో, రైతులు పాల్గొన్నారు.

ఆలయానికి పలువురి విరాళాలు

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని పోతురెడ్డిపల్లి వీరాంజనేయ దేవస్థానం భూదానం నిమిత్తం పలువురు విరాళాలు అందజేసినట్లు ఆలయ నిర్వాహకులు తేజ స్వామి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రాంపూర్ (కలాన్)కు చెందిన పిట్ల రవి, రాంపూర్ గ్రామ కాటేపల్లి మోహన్ ఇరువురు తల 2 వేల ఒక వంద రూపాయలు విరాళంగా అందజేయగా బాన్స్ వాడ శ్రీధర్ చారి 2 వేల ఒకవంద రూపాయలు , పిట్లం గ్రామ నివాసి ఏనుగంధ్ల రవీందర్ రెడ్డి 11 వేల రూపాయలను విరాళంగా అందజేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామిని దర్శించుకున్న సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి దంపతులు



జడ్జి దంపతులకు తీర్థప్రసాదం, చిత్రపటం అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇస్సన్న పల్లి, (రామారెడ్డి)లో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానాన్ని మంగళవారం కామారెడ్డి సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ పూజారులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ ఆలయ చరిత్రను వివరించారు. ఆలయ కమిటీ శాలువాతో సన్మానించి, స్వామి వారి జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రామచంద్రం, ఆలయ కమిటీ సభ్యులు, మనీష్ శర్మ, సిబ్బంది సురేందర్, సందర్శకులు తదితరులు పాల్గొన్నారు.

కూలిన మెడికల్ కళాశాల ప్రహరీ




వీక్లిబజార్ వైపు కూలిన కళాశాల ప్రహరీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గత వారం రోజులుగా నిత్యం వర్షం కురుస్తూనే ఉంది. దీంతో నగరంలోని వీక్లీ మార్కెట్‌లో గల డీఎస్ మార్కెట్ పక్క గల్లీలో మెడికల్ కళాశాలకు ఆనుకుని ఉన్న భాగంలో ఆనుకొని ప్రహరీ గోడ నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలకు ఆనుకొని ఉంటుంది. ఆ గోడ అర్ధరాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. ఆ సమయంలో జన సంచారం లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు సమాచారం అందించడంతో రాకపోకలకు ఇబ్బంది కావడంతో మున్సిపల్ అధికారులు జెసిబి సహాయంతో వాటిని తొలగించే పనులు చేపట్టారు

మధురాతండాలో కంటివెలుగు ప్రారంభం



ఇంటింటికీ వెళ్లి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బం,ది

నవతెలంగాణ-జుక్కల్

మారుమూల గ్రామాలలో గిరిజన తండాలలోనే కంటి వెలుగు పరిక్షల బృందం శిబిరాలు నిర్వహించడం ముఖ్యమంత్రి కేసిఆర్ బీఆర్ఎస్‌తోనే సాధ్యమని సర్పంచ్ సంజీవ్ చౌహన్ అన్నారు. మంగళవారం మండలం లోని మధురాతండాలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. తండాలో కంటి సమస్యలున్న వారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమున్న వారికి ఉచితంగా కళ్ల అద్దాలు, చుక్కల మందులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆపరేషన్‌లు సైతం చేయనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని తండా వాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

నవతెలంగాణ-మద్నూర్

వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ వారు తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. మంగళవారం వీరి ఆందోళనలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివోఏ లను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. .

జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలి

- వారి డిమాండ్‌లు నెరవేర్చాలి
- సమ్మెకు పలువురి మద్దతు

నవతెలంగాణ-విలేకరులబృందం



దోమకొండలో మద్దతు తెలిపిన కాంగెస్ నాయకులు



రామారెడ్డిలో నినాదాలు చేస్తున్న జేపీఎస్‌లు

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యూలర్ చేసి వారి డిమాండ్‌లను నెరవేర్చాలని పలువురు కోరారు. జేపీఎస్‌ల సమ్మె మంగళవారంతో ఐదో రోజుకు చేరింది. కాగా వీరి సమ్మెకు పలువురు మద్దతు తెలిపారు. దీక్ష శిబిరాలకు వచ్చి సంఘీభావం తెలుపుతున్నారు.

దోమకొండ : దోమకొండ మండల కేంద్రంలో జీపీ ఎదుట జేపీఎస్‌ల సమ్మెకు బీబీపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్, నాయకులు మద్దతు తెలిపి దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జూనియర్ పంచాయతీ కార్యదర్శి లను రెగ్యులర్ చేసి 4 ఏళ్ల ప్రొబేషన్ కాలాన్ని సర్వీస్‌పని దినాలుగా గుర్తించాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శిల కుటుంబా లకు ఆర్థిక సహాయం అందించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందు, భూమా గౌడ్,జూనియర్ పంచాయతీ కార్యదర్శి లు రాహుల్, శేఖర్, అంజి బాబు, అఖిల పాల్గొన్నారు.

జేపీఎస్‌లకు ఆర్థిక సాయం

తాడ్వాయి: తాడ్వాయి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె కొనసాగుతుంది. మంగళవారం 5వ రోజుకు చేరింది. కాగా వీరి సమ్మెకు సంఘీభావంగా తాడ్వాయి గ్రామ సర్పంచ్. బండారు సంజీవులు తన వంతుగా రూ.10,000 ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం చేసిన సర్పంచ్‌కు జేపీఎస్‌లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జేపీఎస్‌ల సమ్మెకు పలువురి మద్దతు

తాడ్వాయి: తాడ్వాయి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట జేపీఎస్‌లు చేపట్టిన సమ్మెకు ఎంపీపీ కౌడి రవి, వైస్ ఎంపీపీ నర్సింలుతో పాటు మండల సర్పంచులు సంఘీభావం తెలిపారు. అనంతరం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ తమకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తమను రెగ్యూలర్ చేయాలని సూచించారు.

రామారెడ్డి: జూనియర్, అవుట్సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల నిరవదిక సమ్మె మంగళవారానికి ఐదవ రోజు చేరుకుంది. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవదిక సమ్మెకు మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు అరవింద్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం వెంటనే, ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో ఇచ్చిన హామీని అమలు చేసి, జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూర్య జి రావు, జగదీశ్వర్ రెడ్డి, నరసయ్య, శ్రీనివాస్, వనజ, స్రవంతి, లావణ్య, స్వర్ణలత, రాజేష్, నరేష్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చి జూనియర్ పంచాయతీ కార్యదర్శిలను వెంటనే క్రమబద్ధీకరించాలి డిమాండ్ చేస్తూ వారు చేపట్టిన సమ్మె ఐదవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొబేషన్ పీరియడ్ నాలుగేండ్లు పూర్తి అయిన కూడా తమను క్రమబద్ధీకరించడం లేదని వాపోయారు. క్రమబద్ధీకరణ చేసే వరకు తమ సమ్మెను శాంతియుతంగా కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సిద్ధు, హరీష్ , రాజు, సుజాత, సంతోష్ తదితులున్నారు.



ఎల్లారెడ్డిలో..



జేపీఎస్‌లకు తాడ్వాయి సర్పంచ్ ఆర్థిక సాయం అందజేత..



తాడ్వాయిలో సంఘీభావంగా కూర్చున్న ప్రజాప్రతినిధులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- తూకం వేసి తక్షణమే ధాన్యం తరలించాలి
- కాంగ్రెస్ డిమాండ్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/గాంధారి





ఎల్లారెడ్డి : కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు.. గాంధారిలో ధాన్యం పరిశీలన

ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని మంగళవారం జిల్లా కలెక్టర్‌కు ఎల్లారెడ్డి నియోజకవర్గ అసెంబ్లీ ఇంచార్జి సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు వినతిపత్రాన్ని అందాచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో అకాల వర్షంతో వడగండ్ల వానతో తీవ్రంగా నష్టపోయిన నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే 25 వేల రూపాయల నష్టపరిహారాన్ని చెల్లించాలని అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం వెంటనే పూర్తిగా కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి వైస్ ఎంపీపీ నర్సింహులు , కాంగ్రెస్ నాయకులు చిరంజీవులు, లైన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : రైతుల పడుతున్న బాధలను బీఆర్ఎస్ నాయకులు, పాలకులు, అధికారులు సైతం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూర్పు రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధారి మండలంలోని ముద్దెల్లి గ్రామంలోని కల్లాల్లో ఉన్న వరి ధాన్యం కుప్పలను ఆయన పరిశీలించారు. యాసంగి వరి పంటను గత 15 రోజుల నుంచి కల్లాల్లో కుప్పలుగా పోసినా పట్టించుకునే నాథుడు లేదని వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పంట తడిసి మొలకలు వస్తున్నాయని తెలిపారు. వర్షాలకుకొట్టుకపోతున్నదని, అయినా పాలకులు స్పందించడం లేదని అన్నారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి కొనుగోలు చేపట్టి సకాలంలో ధాన్యం తరలించాలని, లేకుంటే బీఆర్ఎస్ నాయకులను ఎక్కడికక్కడ రైతులతో కలిసి అడ్డుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముద్దెల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు నయీమ్, కాన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బిందాస్, ఆన్సర్, చందు నాసర్, రాము యాదవ్, దేశం సాయిలు, మురళి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

- టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష



జర్నలిస్టుల రిలే దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న వెంకట్‌గౌడ్

నవతెలంగాణ-తాడ్వాయి

ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో జర్నలిస్టులు మంగళవారం నిరసన చేపట్టారు. ఇండ్ల స్థలాల కోసం యూనియన్ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని, అవసరమైతే నిరాహార దీక్షలు చేస్తామనిజర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు కృష్ణచారి, విజయానంద్ సిద్దాగౌడ్, బొక్కల వేణు ప్రకటించారు. కాగా జర్నలిస్టుల ఆందోళనలకు పలు పార్టీలు, సంఘాలు మద్దతు పలికాయి. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్, సిఐటియు జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డెపల్లి సుభాశ్‌రెడ్డి, బీజేపీ నాయకులు వెంకటరమణారెడ్డి, బీఎల్‌టీయూ నాయకులు సిద్ధ రాములు తదితరులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ నేషనల్ కౌన్సిల్ సభ్యులు కృష్ణమాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయానంద్, ఫెడరేషన్ సభ్యులు సాయిలు యాదయ్య మాట్లాడుతూ రాష్ట్రం వచ్చి తొమ్మిది సంవత్సరాలు అవుతున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించలేదని తెలిపారు. జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వం హయాంలో ఇచ్చిన ఇండ్ల స్థలాన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయం కోసం తీసుకున్నారని, కానీ మళ్లీ ఇవ్వలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సిద్ధ గౌడ్, వేణు, ప్రవీణ్ గౌడ్, కృష్ణమూర్తి, సాయిబాబా , లింగం సాయిలు, యాదయ్య, ప్రవీణ్, నర్సింలు, శ్రీనివాస్, నర్సాగౌడ్, భాస్కర్, కరుణాకర్, లింగం, రాజు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా బీఆర్ఎస్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండల కేంద్ర బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్ష ఎన్నిక ఉత్కంఠగా సాగింది. మాజీ అధ్యక్షుడు బాలకృష్ణ ఆకస్మికంగా మృతి చెందడంతో మంగళవారం మండల కేంద్రంలోని రామ్ మందిర్ కళ్యాణ మండలంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి గ్రామ పార్టీ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఇందులో మైసగౌడ్, కంది మల్లేష్ పేర్లను ఇరువురు బలపరచడంతో ఎన్నిక కొద్దిసేపు వాడివేడిగా సాగింది. బిఆర్ఎస్ పార్టీ క్రమశిక్షణకు మారుపేరు అని ప్రతి ఒక్కరు క్రమశిక్షణ పాటించాలని మండల పార్టీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ సూచించారు. కంది మల్లేష్, మైషా గౌడ్‌ల సమ్మతితో ఇద్దరిలో కంది మల్లేశ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం కు గ్రామ కమిటీ ఎన్నిక కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యకర్తలే నాయకులుగా ఎదిగేందుకు బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ ఎంతగానో దోహదప డుతుందన్నారు. టిఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు, వివరించ వలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన గుర్తు చేశారు. గ్రామ కమిటీ ఎన్నికైన వారందరూ ప్రజలతో మమేకమై ఉండి ప్రజల సమస్యలను తెలుసుకొని మండల కమిటీ వివరించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు ఎన్నికైన వారు ప్రజలతో సాంఘికంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాల్య విఠల్ , జిల్లా కోఆప్షన్ మెంబర్ మాజిద్, సర్పంచ్ ఫోరం కన్వీనర్ రాము, గ్రామ నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్, సాయ గౌడ్, సాయిలు, ఖలీల్, మోసిన్, భూమయ్య, ఇబ్రహీం,రాధ కృష్ణ, బాలమల్లుగౌడ్, తదితరులు హాజరయ్యారు.

పంటల పరిశీలన

నవతెలంగాణ-తాడ్వాయి

గత మూడునాలుగు రోజులుగా కురుస్తున్న రాళ్లవానకు వరి పంటలు నేలకొరగడంతో మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో వరి పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షానికి నష్టపోయిన పంటల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్టు తెకలిపారు. ఆయన వెంట విస్తరణ అధికారి రైతులు రాజిరెడ్డి అనిష్ రెడ్డి, పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఆకాష్ బైజూస్ విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ-నిజామాబాద్



నిజామాబాద్ లోని ఆకాష్ బైజూస్ విద్యార్థి సిద్ధార్థ అన్నే జెఈఈ- 2023 మెయిన్స్ లో 99.77 పర్సంటైల్ సాధించి తల్లిదండ్రులతో పాటుగా ఇనిస్టిట్యూట్ కు గర్వకారణంగా నిలిచాడు. ఈసందర్భంగా ఆకాష్ బైజూస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అభిషేక్ మహేశ్వరి మాట్లాడుతూ అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్నానన్నారు. పర్సంటైల్ టాపర్ గా అతను సాధించిన విజయం, తాను పడిన కష్టం, అంకితభావం, తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహం ఎంతో ఉందని గుర్తుచేశారు.

దళితబంధు ఎమ్మెల్యేల అవినీతి చిట్టా బహిర్గతం చేయాలి

- ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకుల నిరసన

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

దళిత బంధు పథకంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అవినీతిని వ్యతిరేకిస్తూ ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం నాడు ఎమ్మార్పీఎస్,ఎం.ఎస్ పి నాయకుల ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు భాగయ్య మాట్లాడుతూ దళిత బంధు పథకంలో 2 నుండి 3 లక్షలు తీసుకున్నట్టు ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్.. సదరు అవినీతి ఎమ్మెల్యేల చిట్టాను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను తక్షణమే బీఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని, దళిత బంధు అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల వివరాలు గవర్నర్ సేకరించాలని, దళిత బందులో అవినీతి జరిగిందని ముఖ్యమంత్రి ప్రకటించిన నేపథ్యంలో హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలని కోరారు. ఎమ్మెల్యేలు లంచంగా తీసుకున్న 2 నుంచి 3 లక్షలు లబ్దిదారులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో ఎంఎస్పి జిల్లా ఇంచార్జ్ పద్మారావు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బాలరాజ్, బాన్సువాడ ఇంచార్జ్ దాకయ్య, మానెయ్య, పర్వయ్య, బాలయ్య, బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షిండేను కలిసిన నాయకులు

నవతెలంగాణ-మద్నూర్



ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే మంగళ వారం మద్నూర్ మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులతో పాటు మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బండి వార్ విజయ్ చోళ వార్ హనుమాన్లు స్వామి చాట్ల శంకర్ తదితరులు ఎమ్మెల్యేను కలిశారు. వీరితో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు మద్నూర్ గ్రామ సర్పంచ్ సురేష్ పాకల విజయ్ కుమార్ రచ్చ వార్ కుషాల్ తదితరులు ఉన్నారు.

పంటలు పరిశీలన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని సికింద్రాపూర్, జక్రాన్‌పల్లిలో ఇటీవల కురిసిన వడగండ్ల వానకు నష్టపోయిన వరి, నువ్వులు, టమాట పంటను పరిశీలించి నష్టపోయిన రైతులను కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. నిజామాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎంఎల్‌సీ డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, డిసిసి కార్యదర్శి భాస్కర్‌రెడ్డి. మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి జక్రాన్ పల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సొప్పరి వినోద్, లక్ష్మణ్, సంజీవరెడ్డి, నవీన్ రెడ్డి, అభి, నారాయణ, రవి, అక్బర్, సుధీర్, ప్రశాంత్, ప్రేమ్ కుమార్, సాజిత్, నారాయణ, గంగాధర్, ప్రశాంత్, మధు, బద్దం బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న నాయకులు

వర్షంతో కాలనీలు జలమయం

• **తప్పని ఇబ్బందులు**

నవతెలంగాణ-ముప్కాల్

సోమవారం రాత్రి కురిసిన వర్షానికి మండల కేంద్రంలో పలు కాలనీలో వర్షపునీళ్ల దర్శనమిచ్చాయి. దీంతో కాలనీ వాసులు చాలా ఇబ్బందులకు గురయ్యారు. పలు కాలనీలో మురికి కాలువలు లేకపోవడంతో వర్షపునీరు ఇలా ప్రధాన వీధుల్లో నిల్వ నిలవడం వల్ల పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి డ్రైనేజీ పనులు చేపట్టి రానున్న రోజుల్లో ఇలాంటి పరిస్థితులు రాకుండా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు..



కాలనీలో నిలచిన వర్షం నీరు

ప్రాణం చాలా విలువైనది

• **విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో ఎస్ఈ**

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/ఎడపల్లి

ప్రాణం చాలా విలువైనదని అందరూ విధులు సక్రమంగా నిర్వహించాలని ఎస్ఈ ఆర్ రవీంద్ర అన్నారు. విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా పవర్ హౌస్ లోని మీటింగ్ హాలులో మంగళవారం నిజామాబాద్ డివిజన్‌లోని విద్యుత్తు కార్మికులు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఈ ఆపరేషన్ ఆర్.రవీందర్ మాట్లాడుతూ ప్రాణం చాలా విలువైనదని, ప్రజల, ఉద్యోగుల ప్రాణాలు కాపాడ్డానికి శక్తి వంచన లేకుండా, భద్రతకు అగ్రపీఠం వేసి, ప్రమాద నివారణకు పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. విద్యుత్ లైన్లో పనిచేసేటప్పుడు విద్యుత్ ప్రవహిస్తుందా లేదా అని ఖచ్చితంగా నిర్ధారణ చేసుకొని, విద్యుత్ లైన్ ఎర్తింగ్ చేసుకొని పని చేయాలనీ సూచించారు. సమావేశంలో ముందుగా టిఎస్ఎన్పీడిసిఎల్ సిఎండి గోపాల్ రావు పంపిన సందేశాన్ని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. నిజామాబాద్ డిఈ ఆపరేషన్ ఎం.శ్రీనివాసరావు అధ్యక్షత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిఈ టెక్నికల్ ఏ.రమేష్, పట్టణ ఏడిఈ లు చంద్రశేఖర, తోట రాజశేఖర్, వీరేశం, నందిపేట్ ఏడిఈ అశోక్, ఏడిఈ సుహాసిని, డివిజన్ ఏఈలు, సబ్ ఇంజనీర్స్, స్టాఫ్ ఫోర్ మన్‌లు, లైన్ ఇన్స్పెక్టర్లు, లైన్‌మెన్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు, జూనియర్ లైన్ మన్ లు 150 మంది వరకు కార్మికులు, ఉద్యోగులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.



ఎడపల్లి: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఎడపల్లి: విద్యుత్ ప్రమాదాల నుండి రక్షణ పొందాలంటే విద్యుత్ భద్రత సూచనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎడపల్లి ఏడిఈ లక్ష్మణ్ నాయక్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ వినియోగంపై గ్రామీణ ప్రాంత ప్రజలకు రైతులకు అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఏడీఈ లక్ష్మనాయక్ మాట్లాడారు విద్యుత్తు పొదుపుగా వాడాలన్నారు. అవసరమైనప్పుడు మాత్రమే విద్యుత్ వాడాలని,. రైతులు బిఎస్ఎన్ పద్ధతులను పాటించి నాణ్యమైన విద్యుత్ సరఫరా పొందాలని ఆయన కోరారు. వాషింగ్ మెషిన్లను ఫుల్ లోడ్ వద్ద మాత్రమే వాడాలని, పగటి సమయంలో డ్రాయర్ ను వాడవద్దని తెలిపారు. రోజుకో యూనిట్ విద్యుత్ ఆదా చేస్తే జీవితకాలంలో లక్ష రూపాయలను పొదుపు చేయవచ్చని తెలిపారు. అంతకుముందు విద్యుత్ వినియోగం వాడకంపై అధికారులు ప్రజాప్రతినిధులు గోడు పతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రాన్స్కో ఏఈ జావీద్, లైవ్ ఇన్స్పెక్టర్ రమేష్, లైన్మెన్ పవన్, సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్, ఎంపీటీసీ మనిషా రెడ్డి, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



నిజామాబాద్‌సిటీ : మాట్లాడుతున్న అధికారి

కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

• **సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు**



మాట్లాడుతున్న రమేష్‌బాబు

నవతెలంగాణ - బోధన్

కార్మికుల సమస్యల పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన మేడే వారోత్సవాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించాలని అన్నారు. అంగన్వాడి టీచర్లను కూడా ప్రభుత్వం పర్మినెంట్ చేయాలన్నారు. వారిని పర్మినెంట్ ఉద్యోగులుగా పరిగణించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని, మానసిక ఒత్తిడి లేకుండా మంచి వాతావరణంలో ఉద్యోగాలు చేసుకునే విధంగా సహకరించాలని డిమాండ్ చేశారు. వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పించాలని, వేధింపులు ఆపాలని, టీచర్‌కు 15 రోజులు, ఆయమ్మకు 15 రోజులు మే నెలలో సెలవులు ఇవ్వాలని, అలాగే మినీ అంగన్వాడీ టీచర్లకు, ఆయమ్మ లేని సెంటర్లకు 15 రోజులు వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే కాలంలో సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధరప్ప, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యేశాలా గంగాధర్, బోధన్ అంగన్వాడి ప్రాజెక్టు ఐసిడిఎస్ అధ్యక్షురాలు మంగమ్మ, కార్యదర్శి విక్టోరియా రాణి, సహాయ కార్యదర్శి ఎలిజబేత్ రాణి, వచ్చల, పద్మ, అనిస్ ఫాతిమా, లక్ష్మి, సావిత్రి, ప్రజ్ఞ, సత్యగంగామణి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ ఎకనామిక్స్ పరీక్ష వాయిదా

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

మంగళవారం నిర్వహించాల్సిన ఓపెన్ ఇంటర్ తెలుగు మీడియం ఎకానమిక్ పరీక్ష వాయిదా వేసినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఒక ప్రకటన తెలిపారు. ఈనెల 2న నిర్వహించవలసిన తెలుగు మీడియం ఎకనామికల్ పరీక్షను ఈ నెల 13కు వాయిదా వేసినట్టు పేర్కొన్నారు.

ఓపెన్ ఇంటర్, ఎస్ఎస్సి పరీక్షల నిర్వహణలో భాగంగా మంగళవారం 10వ తరగతి ఓపెన్ స్కూల్ విద్యార్థులకు సోషల్ పరీక్షకు 1531 గాను 1371 విద్యార్థులు హాజరయ్యారు. ఓపెన్ ఇంటర్ ఎకనామిక్ పరీక్షకు ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ మీడియం విద్యార్థులు 733కు 667 మంది విద్యార్థులు హాజరయ్యారు. మంగళవారం నిర్వహించిన పరీక్షలలో విద్యార్థులు ఎటువంటి మాల్ ప్రాక్టీస్కు పాల్పడలేదు.

వీఆర్ఏ కారుణ్య నియామకం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన వీఆర్ఏకు కారుణ్య నియామకంలో భాగంగా వారసత్వ నియామకం చేసినట్టు మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు సాయన్న మంగళవారం తెలిపారు. గతనెల 9న కలిగోట గ్రామానికి చెందిన తలారి కిష్టన్న వీఆర్ఏగా విధులు నిర్వహిస్తు అనారోగ్య కారణంగా మరణించారని తెలిపారు. వీఆర్ఏ కారుణ్య నియామకం ద్వారా తలారి కిష్టన్న కుమారుడు తలారి రాజుకి వీఆర్ఏగా ఈనెల ఒకటిన తహశీల్దార్, ఉపతహశీల్దార్, వీఆర్ఏల సమక్షంలో అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీని అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో తలారి మధు, బండి గంగాధర్, షేక్ సాదుల్ల పాల్గొన్నారు.

4 నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు

• **విజయవంతం చేయండి : ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్**

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ పిలుపునిచ్చారు. మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ మాట్లాడుతూ.. ఈనెల 4, 5,6 తేదీల్లో విశ్వశాంతి విద్యాసంస్థలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ సమస్యలపైన అధిక ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా చర్చించనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి కోసం కనీసం సమావేశాలను నిర్వహించక పోవడం విడ్డూరయని అన్నారు. ప్రభుత్వ హాస్టల్లో పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు 25శాతం పెంచిన అమలుకు నోచుకోకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో పరిశోధనకు అధిక ప్రాధాన్యత అందించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్, నగర కార్యదర్శి మహేష్, యూనివర్సిటీ అధ్యక్షులు ప్రసాద్, నాయకులు అజాద్, శ్రీకాంత్, అభిలాష్, మనిచందన్, మహేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన భాస్కర్ రెడ్డి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న భాస్కర్‌రెడ్డి

నవతెలంగాణ-చందూర్(వర్ని)

మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి జిల్లాల డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందూర్ సొసైటీ చైర్మన్ అశోక్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. మొక్కజొన్న, వరి ధాన్యం అకాల వర్షాలకు తడిసిన దిగులు చెందవద్దని రైతులకు ధీమా ఇచ్చారు. ప్రతి గింజను కొనుగోలు చేసేలా సొసైటీలకు పిలుపునివ్వడం జరిగిందని పేర్కొన్నారు. లక్ష్మాపూర్ లో పిఎసిఎస్ సబ్ సెంటర్ కు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ కవిత అంబర్ సింగ్, పీఎసీఎస్ చైర్మన్ అశోక్, సర్పంచులు సత్యనారాయణ, కర్దం సాయి రెడ్డి, రవి, దేవి సింగ్, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, సీనియర్ నాయకులు అరికెల నర్సారెడ్డి, మాజీ చైర్మన్ మాధవరెడ్డి, ప్రచారం కార్యదర్శి ముజ్జు పాల్గొన్నారు.

కట్టడాలకు అనుమతులు లేవు

• **తేల్చిన డీఎల్పిఓ**

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని మైలారం గ్రామపరిధిలో నూతనంగా నిర్మిస్తున్న బీబీ ఫంక్షన్ హాల్, ఎంఎం ఫంక్షన్ హాల్, కమర్షియల్ కాంప్లెక్స్‌లు అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు తేల్చి చెప్పారు. దినపత్రికలలో ప్రచురితమైన అనుమతులు లేని అక్రమ కట్టడాలు వార్త ఆధారంగా నిర్మాణ స్థలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. బీబీ ఫంక్షన్ హాల్ నిర్వాహకుల వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేవని, గ్రామపంచాయతీ నుండి అనుమతులు పొందలేరని, పలుమార్లు నోటీసులు ఇచ్చిన కూడా స్పందన లేదని మైలారం ఉపసర్పంచ్ గాండ్ల సత్యానంద్ తెలిపారని అన్నారు. రెండు రోజులలో ఆన్లైన్ ప్రక్రియ పూర్తి చేసి అనుమతులు పొందాలని, లేనిపక్షంలో డిస్మెంటల్ చేయిస్తామని ఆదేశించారు. ఎంఎం ఫంక్షన్ హాల్ యజమాని అనుమతి పత్రాలు పొందినప్పటికీ, ఆన్లైన్లో చెల్లించవలసిన అనుమతి రుసుం ఇంతవరకు చెల్లించకపోవడంతో, రెండు రోజులలో రుసుము చెల్లించాలని,అప్పటివరకు పనులు నిలిపివేయాలని ఆదేశించారు. అదేవిధంగా మైలారం శివారులో గల దొండ్ల వాగు సమీపంలో నిర్మిస్తున్న కమర్షియల్ కాంప్లెక్స్ 20 షెటర్ల యజమాని గ్రామపంచాయతీలో గృహ నిర్మాణం కోసం నకిలీ మ్యాప్ తో అనుమతి పొందాడని, తీరా నిర్మాణం సమయంలో షట్టర్ల నిర్మాణం చేశాడని, తమకు కేవలం ఇంటి నిర్మాణం కోసమే అని చెప్పి షట్టర్లు నిర్మించేంతవరకు తెలియదని, ఉప సర్పంచ్ చెప్పారన్నారు. రెండు రోజులలో డిటిసిపి అనుమతులు పొంది, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం ఆన్లైన్లో అనుమతి పొందాలని, లేనిపక్షంలో ఇల్లీగల్ నిర్మాణం కింద డిస్మెంటల్ చేస్తామని, అప్పటివరకు గదులను అద్దెకు ఇవ్వరాదని, ఎలాంటి అమ్మకాలు చేపట్టరాదని ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి సమస్యలు ఉత్పన్నమైనప్పుడు అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం సరికాదని, ఇలాంటి తప్పిదాలు జరిగితే స్థానిక అధికారుల పైన కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైలారం గ్రామస్తులకు ఇప్పటివరకు ఈ విషయంపైన అవగాహన లేకపోవడం కొసమెరుపు .ఈయన వెంట ఎంపిడిఓ లక్ష్మీప్రసాద్, సిబ్బంది వున్నారు.



కట్టడాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

• **ఉపతహసీల్దార్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి**

నవతెలంగాణ-ఎడపల్లి

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కాంగ్రెస్ నాయకులు ఉపతహసీల్దార్ నారాయణకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు వినోద్ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. మండలంలోని 17 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయకుండా, హమాలీలను, లారీలను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంవల్ల చేతికొచ్చిన వరి ధాన్యం అకాల వర్షాలవల్ల పాడైపోయి రైతులు నష్టపోవలసి వస్తుందన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు 50 వేల చొప్పున నష్టపరిహారాన్ని చెల్లించాలని, గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని ఐకెపి సెంటర్లలో నిర్ణయించిన ధరకు కొనుగోలు చేసి నగదును రైతుల ఖాతాల్లో త్వరగా జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కేవలం పండించి రోడ్ల పైన ఉన్న ధాన్యాన్ని మాత్రమే పరిశీలించకుండా అకాల వర్షాలకు నష్టపోయిన వరి పొలాలను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనా వేసి రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బుడ్డ పోశెట్టి-కేకేసి-బోధన్ నియోజకవర్గం కోఆర్డినేటర్.మెగావత్ సరిదాస్, బోధన్ నియోజకవర్గ కోఆర్డినేటర్, కాజా ఫయాజుద్దీన్ నిజామాబాద్ జిల్లా (కేకేసి) స్ట్రీట్ వెండర్స్ చైర్మన్ సున్నపు ఒడ్డెన్నఎడపల్లి మండల(కేకేసి) కోఆర్డినేటర్, నిరడి రవికుమార్ కాంగ్రెస్ పార్టీ ఎడపల్లి మండల కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజగుప్తా, రషీద్,ప్రతాప్ రెడ్డి, కరుణన్న యువసేన నాయకులు రాజశేఖర్, విజయ్ చందర్, ఎడపల్లి మండల కరుణన్న యువసేన అధ్యక్షులు బండ నవీన్ పాల్గొన్నారు.

పంటలు పరిశీలన



మల్లారంలో పంటను పరిశీలిస్తున్న అధికార, నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని మల్లారంలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ అధికారి రమాకాంత్‌తో కలిసి బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మీసాల సుధాకర్ రావు మంగళవారం పరిశీలించారు. ఆనంతరం మాట్లాడుతూ చేతికి వచ్చిన పంట అకాల వర్షానికి దెబ్బతిందని తెలిపారు. మల్లారం శివారులో రెండు వందల ఎకరాల ఆయకట్టు పంట నష్టం జరిగిందన్నారు. తడి పంటను ప్రభుత్వం కొంటామని చెప్పినప్పటికీ దాంట్లో ఎన్నో ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. తడిసిన పంటను కొందరు కొనడానికి వెనుక ముందు చేస్తున్నారని అన్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, సర్పంచ్ చింతకింది నగేష్, తదితరులు పాల్గొన్నారు. గాంధీనగర్ తాండ గ్రామపంచాయతీ పరిధిలో మండల వైస్ ఎంపీపీ అన్నం సాయిలుతో కలిసి తడిసిన ధాన్యం పరిశీలించారు. త్వరగా పిఎసిఎస్ ఆధ్వర్యంలో కనుగోలు కేంద్రాల ద్వారా కాంటా చేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల ఎస్‌టి సెల్ అధ్యక్షులు గోపాల్ నాయక్ , మండల ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి వసంతరావు నాయక్, గాంధీనగర్ తాండ బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మారయ్య తదితరులు రైతులకు తగు సూచనలు చేయడం జరిగింది

అక్రమ తొలగింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

• **సీనియర్ అసిస్టెంట్ పై చర్యలు తీసుకోవాలి**

• **అటెండర్ గాయత్రికి న్యాయం చేయాలని వినతి**


నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్ పల్లి ఆరోగ్య కేంద్రంలో అటెండర్ గా పని చేస్తున్న గాయత్రిని అక్రమంగా తొలగించారని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కమ్మర్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సలీం ఉద్దేశపూర్వకంగా, పక్షపాత ధోరణితో, వ్యక్తిగత స్వార్థంతో అక్రమ తీర్మాణంచేసి ఏమి తెలియని అమాయకపు ఎస్సీ మాదిగ మహిళను కంటిజెన్ వర్కర్ (అటెండర్)గా తొలగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ తీర్మానాన్ని రద్దుచేసి, యధావిధిగా గాయత్రిని కంటిజెన్ వర్కర్ (అటెండర్)గా కొనసాగించాలని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ, బాధితురాలి సమక్షంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు సుంకరి విజయకుమార్ మాట్లాడుతూ... కమ్మర్‌పల్లి గ్రామంలో నివాసం ఉంటున్న ఎస్సీ మాదిగ కులానికి చెందిన గాయత్రి గత కొన్ని సంవత్సరాల నుండి కంటిజెన్ వర్కర్ (అటెండర్)గా సేవలు అందించిందని అన్నారు. కరోనా సమయంలో గాయత్రి ఆసుపత్రిలో సేవ చేసిందన్నారు. కమ్మర్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న సలీం ఉద్దేశపూర్వకంగా గాయత్రిని విధుల నుండి తొలగించారన్నారు. ఆ స్థానంలో ముస్లిం మైనారిటీ మహిళను నియమించారని తెలిపారు. పక్షపాత ధోరణితో వ్యవహరించి, అక్రమ తీర్మాణంతో గాయత్రిని తొలగించిన సీనియర్ అసిస్టెంట్ సలీం పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలోమండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సుంకరి విజయ్, గౌరవ అధ్యక్షుడు పాలేపు నర్సయ్య, ఉపసర్పంచ్ పాలేపు చిన్న గంగారాం, కార్యవర్గ సభ్యులు పాలేపు రవికిరణ్, కొంటికంటి బాబురావు, నరేందర్, గుర్రం నరేష్, బెజగం గంగాధర్, లెక్చరర్ సాయన్న, దుబ్బాక శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

పంట పొలాలను పరిశీలించిన డీఏవో



పంటను పరిశీలిస్తున డీఏవో

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని రావుట్ల గ్రామంలో వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ మంగళవారం రైతులతో కలిసి పరిశీలించారు. వడగళ్ల వర్షానికి నష్టపోయిన పంటలను సర్వే చేసి, పంటనష్టపరిహారం వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తోట రాజ గంగయ్య, గ్రామ సర్పంచ్ తోట బూదెవ్వ, ఉప సర్పంచ్ కొడిగెల రఘువాస్, రైతుబంధు సమితి గ్రామ కో ఆర్డినేటర్ మూత గంగాధర్, రైతులు, ఏఈఓ కొండ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఆత్మీయ సన్మానం

• **దుస్తులు పంపిణీ చేసిన అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త**

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ నగరంలోని శ్రీరామ గార్డెన్స్ లో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త మున్సిపల్ కార్మికుల ఆత్మీయ సన్మానం మంగళవారం నిర్వహించారు. 1500 మంది మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేసి వారితో సహా పంక్తి భోజనం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్ర పఠానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ....సంపదలకు మూలం కార్మికుల స్వేదం. శ్రామికుల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. పట్టణాలు - పల్లెలు అభివృద్ధిలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని తెలిపారు. 106,474 మంది పారిశుధ్య కార్మికులకు మేడే కానుకగా వేతనం వెయ్యిరూపాయలు పెంచారన్నారు. నిజామాబాద్ నగరంలో కార్మికులకు పనిభారం తగ్గించేందుకు కొత్త సిబ్బందిని నియమించామని, కార్మికుల కోసం ప్రత్యేక కంటి వెలుగు-కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేశామని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్ ,నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి ,మాజీ మేయర్ ఆకుల సుజాత, బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు మల్లేష్ యాదవ్, వెల్డింగ్ నారాయణ,అక్బర్ హుస్సేన్,అబ్దుల్ కుద్దుస్, బి ఆర్ ఎస్ కార్మిక విభాగం పట్టణ-అధ్యక్ష కార్యదర్శులు విజయ లక్ష్మి, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మే డే సందర్భంగా పారిశుద్ధ కార్మికులకు ప్రస్తుతం చెల్లించే వేతనానికి అదనంగా రూ.1000 పెంచడంతో హర్షం వ్యక్తం చేస్తూ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ కార్మికులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ మే డే కానుకగా పారిశుధ్య కార్మికులకు వెయ్యి రూపాయలు అదనపు వేతనం ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సక్కురం అశోక్, ఉప సర్పంచ్ కస్తూరి విక్రమ్, ఎంపీటీసి సభ్యురాలు తోట జ్యోతి మనోహర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.